క్లుప్తంగా

నేడు కందూర్‌కు ఎమ్మెల్యే రాక

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి మంగళవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామసభకు ఎమ్మెల్యే హాజరు కానున్నందున పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు జిల్లా డీడీఎన్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని శ్రీసాయిబాబా మందిరం సమావేశం హాల్‌లో ఈనెల 22వ తేదీ(బుధవారం)న జిల్లా దూప, దీపనైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాండ్ల రవి, జిల్లా అధ్యక్షుడు జంగం మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవశర్మ, అన్నవద్దుల ప్రసాద్‌శర్మ, కోశాధికారి నందనం హరికిషన్ పాల్గొంటారన్నారు. సమావేశంలో జిల్లాలోని దూప, దీపనైవేద్య అర్చకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బీసీ జేఏసీ మండలాధ్యక్షుడిగా తిరుపతయ్యగౌడ్

అడ్డాకుల: మూసాపేటకి చెందిన నల్ల తిరుపతయ్యగౌడ్‌ను బీసీ పొలిటికల్ జేఏసీ మూసాపేట మండలాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందజేశారు. నూతన అధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్ మాట్లాడుతూ త్వరలోనే గ్రామకమిటీలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన రాచాల యుగంధర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రజనీకాంత్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పడాల రజనీకాంత్‌ముదిరాజ్ నియమితులయ్యారు. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో ముదిరాజ్‌సంఘాన్ని బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. గ్రామ, మండల కమిటీలు వేసి ముదిరాజ్‌సంఘాన్ని విస్తృత పరిచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, గణేష్, ఆంజనేయులు, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని, 25న జరిగే సభకు ప్రజలు భారీగా తరలిరావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మాచన్‌పల్లిలో సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు హన్మంతు, ఖాదర్, శివలీల, నగేష్, బాలయ్య పాల్గొన్నారు.

హన్వాడ: సీపీఎం 4వ మహాసభలను జయప్రదం చేయాలని మండల సీపీఎం కార్యదర్శి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం వాల్ పోస్టర్‌ను మండలకేంద్రంలో విడుదల చేశారు. నాయకులు రాములు, రేఖమయ్య, బాలకిష్టయ్య, పాండు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తికి చెందిన గంగన్న కొన్నిరోజుల క్రితం మృతిచెందాడు. స్నేహితులంతా కలిసి ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు సోమవారం రూ.50వేలను అందజేశారు.కార్యక్రమంలో స్నేహితులు భాస్కర్‌గౌడ్, బాలస్వామి, రవికుమార్, రాజు నాయుడు, సలాం, రాజు, మహేష్ ఉన్నారు.

జడ్చర్ల: మండలంలోని కిష్టంపల్లి గ్రామంలో నాయీబ్రాహ్మణుడు నిరంజన్ ఇటీవలే మృతి చెందగా ఆయన కుటుంబానికి నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.ఆసంఘం అధ్యక్షుడు బీమయ్య, నాయకులు శివ, ఆంజనేయులు, కృష్ణయ్య ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిన్నచింతకుంట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శేఖర్ అన్నారు. సోమవారం కొకుంట్ల మండలం దాసర్‌పల్లిలో సైబర్‌నేరాలు, రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనులకు ఆటంకం



సిగ్నల్‌గడ్డ వద్ద రోడ్డుపై నెహ్రూ, ఇందిరమ్మ విగ్రహాలు

- ముందుకు సాగని రోడ్డు విస్తరణ పనులు
- అడ్డంకిగా మారుతున్న మహనీయుల విగ్రహాలు
- విగ్రహాల ఏర్పాటుకు ఖరారుకాని స్థలాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

జడ్చర్ల: స్థానిక సిగ్నల్‌గడ్డ వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈపనులకు జాతీయ మహనీయుల విగ్రహాల తరలింపు అడ్డంకిగా మారింది. సిగ్నల్‌గడ్డపై రెండు వైపులగల చౌరస్తాల్లో విగ్రహాలు ఉన్నాయి. రైల్వే బ్రిడ్జికి ఓ వైపు మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరా గాంధీ విగ్రహాలు ఉండగా మరోవైపు గల చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలతో పాటు కొద్దిదూరంలో తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి విగ్రహాలు ఉన్నాయి. 167 నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆయా విగ్రహాలు తొలగించాల్సి రావడం వివాద స్పదంగా మారింది.

సున్నితమైన సమస్య

జాతీయ నాయకుల విగ్రహాల తరలింపు సున్నితమైన సమస్యగా మారింది. ఇటీవల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని సంబంధిత అధికారులు తొలగించారు. దీంతో బీసీ, ఎస్సీ, తదితర సంఘాల నాయకులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. యథాస్థానంలోనే విగ్రహాన్ని ఏర్పాటుచేయడంతో వివాదం సద్దుమణిగింది. ఇతర విగ్రహాల జోలికి పోవాలంటేనే జాతీయ రహదారి అధికారులు భయపడుతున్నారు. ఇప్పటికే శ్రీకాంతాచారి విగ్రహం ఉన్న దగ్గర కాల్వ నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది. విగ్రహం వరకు కొంతభాగం వదిలి మిగతా పనులు పూర్తి చేశారు. నిబంధనల మేరకు రహదారిపై ఉన్న విగ్రహాలను కచ్చితంగా తొలగించాల్సి ఉందని సంబంధిత ఏఈ రవికుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

విగ్రహాల తొలగింపునకు సంబంధించి జాతీయ రహదారుల శాఖ అధికారులు ఇప్పటికే స్థానిక మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మహనీయుల విగ్రహాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని వారు ఇప్పటికే విన్నవించారు. కానీ మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.దీంతో విగ్రహాల తొలగింపులో ఆలస్యం జరుగుతుంది. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు మున్సిపల్ పాలక మండలి సభ్యులు ప్రజల ఆమోదంతో విగ్రహాల తొలగింపు, తిరిగి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవలసి ఉంది. విగ్రహాలను తొలగించి ఎక్కడైన సరైన స్థలంలో భద్రపరిచి మరోచోట ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేసే పరిస్థితి ఉన్నా అందుకు కుల సంఘాలు, నాయకులు ససేమిరా అనే పరిస్థితి నెలకొంది. మొదట స్థలాన్ని ఖరారు చేశాక విగ్రహాల తరలింపునకు సహకరిస్తామని ఇటీవల కొందరు నాయకులు అధికారులకు స్పష్టం చేశారు.

ఏర్పాటు ఎక్కడా..?

సిగ్నల్‌గడ్డ రోడ్డుపై ఉన్న విగ్రహాలను ఇక్కడి నుంచి తొలగిస్తే కొత్తగా ఎక్కడ ఏర్పాటుచేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే రోడ్డుపై ఓ పక్కగా వరుసగా విగ్రహాలను ఏర్పాటు చేయాలని భావించినా అందుకు తగ్గట్లుగా ఎక్కడా సరైన స్థలం లేకపోవడం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయం ఆవరణ కూడా ఇరుకుగా మారింది. ఇక్కడ వాహనాలు నిలిపేందుకు సైతం ఇబ్బందిగా మారిందని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ తెలిపారు. ఇక మిగిలింది ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, అంబేడ్కర్ కళాభవనం, మండల పరిషత్ కార్యాలయం, జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలు ఉన్నాయి. మరి ఇక్కడ అనువుగా ఉంటుందా లేదా అన్న దానిపై విచారించాల్సిన అవసరం ఉంది.

నత్తనడకన

సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనికి తోడు విగ్రహాల తరలింపు జాప్యం కావడంతో రోడ్డు పనులు ఇంకా ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది. పాలకులు, అధికారులు స్పందించి విగ్రహాల ఏర్పాటుకు సరైన స్థలాన్ని ఖరారు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **అందరి సమ్మతితోనే..**
>
> 
>
> విగ్రహాలను కొత్తగా ఏర్పాటుచేసేందుకు అనువైన ప్రదేశాన్ని అన్వేషిస్తున్నాము. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు మున్సిపల్ పాలకమండలి సభ్యులు, తదితర సంఘాల నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. అందరి సమ్మతితోనే ఇతర ప్రదేశంలో విగ్రహాలను ఏర్పాటు చేస్తాం.
>
> – లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ



సిగ్నల్‌గడ్డ రోడ్డుపై అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలు

ఉపాధ్యాయులపై దాడులు తగదు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



మనికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధ్యాయులపై దాడులు చేయడం తగదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ అన్నారు. ఇటీవలే రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై దుండగులు జరిపిన దాడికి నిరసనగా సోమవారం భోజన విరామ సమయంలో మనికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.మధుసూదన్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, నాయకులు నర్సప్ప, అక్తర్ హుస్సేన్, జె.వెంకటయ్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, పి.వెంకటేష్, మల్లేష్, హన్మంతు, అరుణ, శైలజ, చంద్రశేఖర్, నాగయ్య పాల్గొన్నారు.

అడ్డాకుల: హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడికి నిరసనగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్.వెంకటేష్, రామలింగం, చిన్నయ్య, రవినాయక్, శ్రీనివాస్‌రెడ్డి, జుర్రు నారాయణ, సుదర్శన్, శ్రీధర్‌గౌడ్, రాములు, రామచంద్రయ్య ఉన్నారు.

మిడ్జిల్: హెచ్‌ఎంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

దేవరకద్ర రూరల్: హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడిని ఖండిస్తూ లక్ష్మిపల్లి, అడవి అజిలాపూర్‌లోని పాఠశాల సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

నల్లకుంటకట్టపై విద్యుత్ స్తంభం ఏర్పాటు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని నల్లకుంటకట్టపై నెలకొన్న లోఓల్టేజి సమస్య పరిష్కారం కోసం సోమవారం విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేశారు. పాతకేబుల్ షార్ట్ అయి పాడవటంతో దానిని తొలగించి ఆరు స్తంభాలకు నూతన కండక్టర్(వైర్లు)లు వేశారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పర్యవేక్షించగా లైన్‌మెన్ రవి, జూనియర్ లైన్‌మెన్ మథిన్‌ల ఆధ్వర్యంలో స్తంభం, నూతన కండక్టర్లు వేశారు.

ఐదేళ్ల నిరీక్షణకు తెర

- నేడు వీరప్పయ్య షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



దేవరకద్ర రూరల్: ఐదేళ్ల నిరీక్షణకు తెర పడనుంది. ఎట్టకేలకు పట్టణంలోని శ్రీ వీరప్పయ్య స్వామి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. నేడు(మంగళవారం) మంత్రి దామోదర రాజనరసింహ ఈ కాంప్లెక్స్‌ను ప్రారంభించనున్నారు. దేవరకద్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ ఈశ్వర వీర్వప్పయ్య స్వామి ఆలయంకు సంబంధించిన 14ఎకరాల భూమి రాయిచూర్–హైదరాబాద్ వంటి నగరాలను కలిపే ప్రధాన రోడ్డుకు అనుకొని ఉంది. 2019లో అక్కడ ఒక షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి కిరాయి రూపంలో వచ్చిన డబ్బులను దేవస్థాన అభివృద్ధికి కేటాయించాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. వాటిని మూడు బ్లాకులుగా విభజించి మొత్తం 54షాపులను నిర్మించారు. ఇందుకోసం లబ్ధిదారుల నుంచి ఒక్కో షాపునకు రూ.4లక్షల చొప్పున మొత్తం రూ.2.16కోట్లు వసూలు చేశారు. షాపుల నిర్మాణంను ఒక సంవత్సరంలో పూర్తిచేసి లబ్ధిదారులకు నాలుగేళ్ల లీజుకుఇవ్వాలని నిర్ణయించారు. వివిధకారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ఇంతలోపు నిర్మాణంకు సంబంధించిన అంచనా విలువ పెరగడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారులు ముందుకొచ్చి మిగతా డబ్బులను భరిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసుకున్నారు. ఎట్టకేలకు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం కానుండటంతో షాపులను దక్కించుకున్న యజమానులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జడ్చర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21 నుండి 25 వరకు జరగనున్న గ్రామసభల్లో అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం గ్రామసభల్లో పాల్గొనాలని సూచించారు.

'సామాజిక భద్రత'లో లోపాలను సరిచేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రవాణా, రవాణేతరులైన ఆటో, క్యాబ్ డ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉన్న సామాజిక భద్రత పథకంలో ఉన్న లోపాలను సరిచేయాలని తెలంగాణ ఫోర్‌వీలర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2015 నుంచి అమలులో ఉన్న ఈపథకం 5 లక్షల ప్రమాద బీమా అందిస్తుండగా 2024 అక్టోబర్ 8కి ఈపథకం గడువు ముగియడంతో 13, 11, 072మంది లబ్ధిదారులకు బీమా లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. బీమా మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచాలని, ప్రమాద వైకల్యాలు, ఆస్పత్రి ఖర్చులను కవరేజీలో జోడించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తప్పులు దొర్లకుండా చూడండి

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకి సంబంధించి లబ్ధిదారుల వివరాల సేకరణలో తప్పులు దొర్లకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సూచించారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ సమావేశమందిరంలో వార్డుఆఫీసర్లు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. వార్డుల్లో సమస్యలున్నా అధికారులతో చర్చించి పరిష్కారించాలన్నారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, టీపీఓ లక్ష్మీపతి, ఆర్‌ఐలు రమేష్, ముజీబుద్దీన్, అహ్మద్‌షరీఫ్, పెంటయ్య, టి.నర్సింహ పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సోమవారం కరాటే తరగతులను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉండాలంటే తప్పకుండా కరాటే వంటి విద్యల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. అధ్యాపకులు అమీనా ముంతాజ్, పద్మ, అనురాధ, శ్రీదేవి, వాసంతి, కరాటే అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య ఉన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ

మహబూబ్‌నగర్, ఎడ్యుకేషన్/ జెడ్పీసెంటర్: శ్రీకారం ఫౌండేషన్, సాత్విక మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం షాషాబ్‌గుట్ట హైస్కూల్, మైనార్టీ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేందర్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆఫౌండేషన్ అధ్యక్షుడు శశిబాబు, సాత్విక మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బేస్ స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్‌సెంటర్ లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు చంద్రకళ, మహేశ్వరీ శ్రీదేవి, రామలక్ష్మి సోమవారం డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సివిల్స్ కోచింగ్ ఇప్పిస్తామని, ఎటువంటి ఫ్యాకల్టీ లేకుండా డబ్బులు వసూలు చేయడం, నకిలీ సర్టిఫికెట్‌లు ఇస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

భూమి సాగుకు అనుమతి ఇవ్వాలని వినతి



కలెక్టరేట్‌కు వచ్చిన ఎనుగొండ వాసులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని ఎనుగొండ శివారు సర్వే నంబర్432/2, 438లలో ఉన్న 20గుంటల ప్రభుత్వ భూమిని సాగుచేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఆగ్రామస్తులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ విజయేందిర బోయికి సోమవారం వారు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మల్లేపోగు శ్రీనివాసులు, వెంకటయ్య మాట్లాడుతూ దళితులమైన తాము ఈభూమిని మూడు తరాలుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఆభూమిలో సాగు చేసుకోకుండా ఇటీవల అటవీ శాఖాధికారులు కాల్వతీసి అక్కడ చెట్లు నాటారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గుట్టలు, రాళ్లతో ఉన్న భూమిని ఎంతో కష్టపడి వ్యవసాయానికి అనుకూలంగా చేశామని, అధికారులు కాల్వలు తీసి తమ పొట్టకొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మి నర్సిములు, రాములు, వెంకటేష్, బాలమాసయ్య, బాలనాగయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

రేషన్‌కార్డులది నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ

స్టేషన్ మహబూబ్‌నగర్: రేషన్‌కార్డులు లేని వారు ఆందోళన చెందొద్దని, ఇది నిరంతరం సాగే ప్రక్రియ అని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలను పట్టించుకోలేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకొని రేషన్‌కార్డులు పొందాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషితో జిల్లా కేంద్రంలో మైనార్టీలకు సంబంధించి పలు అభివృద్ధి పనులకు రూ.45 కోట్లు మంజూరయ్యాని, వీటితో షాదీఖానా, ఉర్దూఘర్ నిర్మించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు మునీర్, షేక్ ఉమర్, నాయకులు ఖాజపాష, రాశెద్‌ఖాన్, మోసీన్, అంజద్, పీర్ మహ్మద్ సాధిక్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మర్దాన్‌అలీషా దర్గా ఉర్సు

23న వైభవంగా గంధోత్సవం



విద్యుత్ దీపాల వెలుగులో దర్గా

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక షాసాబ్‌గుట్టలోగల హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీషా దర్గా 99వ ఉర్సు ఈనెల 22వ తేదీ(రేపటి) నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాల తొలిరోజు దర్గాలో భక్తిశ్రద్ధలతో గుస్లే షరీఫ్ (జలాభిషేకం) నిర్వహిస్తారు. 23న ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవం ఉంటుందని, గంధాన్ని షేక్ మొహియొద్దీన్ ఇంటి నుంచి వన్ టౌన్, న్యూటౌన్ మీదుగా దర్గాకు తీసుకెళ్తారు. అనంతరం భక్తుల నడుమ దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తారు. 24న (చిరాగే) దీపారాధన, ఖవ్వాలి ఏర్పాటుచేయనున్నారు. 25న దర్గాలో ఖత్మే ఖురాన్ నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీచేస్తారు. ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షాఖాద్రీ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నిఏర్పాట్లు చేస్తున్నారు. ఈఉర్సుకు జిల్లా కేంద్రంతోపాటు హైదరాబాద్, నారాయణపేట, గద్వాల, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, అచ్చంపేట, మహారాష్ట్ర, కర్నాటక నుంచి భక్తులు దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి



చంద్రయాన్ త్రీమాడల్‌పై అవగాహన కల్పిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం నర్సోజీ, ఎంఈఓ సుధాకర్

రాజాపూర్: విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన తప్పక ఉండాలని ఎంఈఓ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని తిర్మలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో రిటైర్డ్ హెచ్‌ఎం నర్సోజీ విద్యార్థులకు చంద్రయాన్ త్రీమాడల్ చూయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రిటైర్డ్ అయిన నర్సోజీ తనకున్న విషయ పరిజ్ఞానాన్ని అందించేందుకు ఇప్పటికీ పాఠశాలకు వచ్చి బోధనలు చేయడం అభినందనీయమన్నారు. పర్యావరణంపట్ల ఓజోన్ పొర ప్రాముఖ్యతతో పాటు రక్షణ, దాని ఉపయోగాలపై విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోల్‌గేమ్



నవాబుపేట: స్థానిక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి నిర్వహించిన పోల్‌గేమ్ యువతను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొత్త క్రీడలో వంద మందికి పైగా యువత పాల్గొని కీడ్రను ఆస్వాదించారు. ఎక్కడ లేని విధంగా ఏర్పాటు చేసిన ఈ ఆటలో యువత ఆసక్తిగా పాల్గొని 15 నుండి 25 ఫీట్ల ఎత్తుగల పోల్స్‌కు రింగులు వేసేందుకు పోటీ పడ్డారు. చివరికి 25 ఫీట్ల విభాగంలో నాని మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి మేఘా రూ.5వేలు, తృతీయ బహుమతి కేశవ్ రూ.2,500ను గెలుపొందారు. విజేతలకు వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి బహుమతులను అందజేశారు. అధ్యక్షుడు సుధాకర్‌చారి అందించారు.రఘువీర్‌శర్మ, అంజనేయులు, నిరంజన్, నసీర్, శ్రీనివాస్, నాగరాజ్ పాల్గొన్నారు.

దుకాణాలకు తాళాలు

మహమ్మదాబాద్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌కు సంబంధించిన వ్యాపార సముదాయాల దుకాణాలకు సోమవారం పోలీసు బందోబస్తు మధ్య తాళాలు వేశారు. 20ఏళ్ల క్రితం పాఠశాలకు సంబంధించిన ఖాళీ స్థలంలో వ్యాపార సముదాయాలను నిర్మించి వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. ప్రస్తుతం మహమ్మదాబాద్ మండల కేంద్రం కావడంతో ఇక్కడ వ్యాపారాలు పుంజుకున్నాయి. దీంతో స్థానిక యువత ఈ దుకాణాలను పొందాలనుకున్నారు. దీంతో యువత, వ్యాపారులకు వార్ కొనసాగుతోంది. ఈనేపథ్యంలో వ్యాపారులతో దుకాణాలు ఖాళీ చేయించాలని కొందరు కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎంకు ఫిర్యాదు చేయడంతో అధికారులు బలవంతంగా షెట్టర్లకు తాళాలు వేశారు. కొందరు వ్యాపారులు షెట్టర్లపై బ్యాంకుల్లో రుణాలు పొంది ఇంకా తీర్చలేదని, ఈరుణాలు తీర్చాలంటే తామే కొనసాగుతామనే వేడుకుంటున్నారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

జడ్చర్ల: ఎర్రగుట్ట సమీపంలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 8మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎర్రగుట్ట సమీపంలో గల వ్యవసాయ పొలంలో పేకాటాడుతున్న 8మందిని అదుపులోకి తీసుకొని వారినుంచి రూ.2700తో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

సాక్షి నెట్‌వర్క్: రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక జాబితాల ఆమోదం కోసం గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో 4 బృందాలు, మండలంలో 6బృందాలు గ్రామసభలు నిర్వహించనున్నారు.

- గండేడ్ మండలంలోని పలు గ్రామాల్లో నేడు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దేవన్న తెలిపారు. ఉదయం 8గంటలకు వెన్నచేడ్, పగిడియాల్, ఆశిరెడ్డిపల్లి, మధ్యాహ్నం 2గంటల నుంచి కొమిరెడ్డిపల్లి, రుసుంపల్లి, చిన్నవార్వాల్ గ్రామాల్లో గ్రామసభలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.
- నవాబుపేట మండలంలో నేటి నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ జయరాంనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఏఓ కృష్ణకిషోర్, బద్రునాయక్, గాయిత్రీ, జ్యోతి పాల్గొన్నారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

జడ్చర్ల టౌన్: స్థానిక వంద పడకల ఆస్పత్రి సమీపంలో ఉన్న శ్రీచక్రసహిత భవాని మాత, శివమార్కండేయ దేవాలయంలో సోమవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివుడికి అభిషేకాలు చేసి అమ్మవారికి పూజలు చేశారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలో హనుమాన్‌చాలీసా పారాయణం ఉంటుందని పద్మశాలి సంఘం సభ్యుడు మిరియాల యాదయ్య తెలియజేశారు.

డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ దివాంజీ తన వాహనంలో కోల్‌కతాకు చెందిన 12 మంది కూలీలను ఏపీలోని కడపలో జరగనున్న సీఎం సభ డెకరేషన్ చేయించడానికి తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో టోల్‌ప్లాజా సమీపంలో ముందు వెళ్తున్న లారీ వెనుక డీసీఎం ఢీకొట్టుకుంది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ దివాంజీ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కూలీలకు ఎలాంటి గాయాలు కాలేదు.